


# ఫోటో గడబిడి

బొడ్డు బాపిరాజు

—: o :—

## రమణ :-

సముద్రంలోని మణులు మాణిక్యాలు వొక సారి వొడ్డుకు కొట్టుకొనివచ్చేట్లు మా స్నేహ సంఘం అంతా వసంతారంభంలో సుడిగాలికి కొట్టుకొనివచ్చినట్లు మా మూర్తి యింటివద్ద కలుసుకున్నాం. మాలోవొక తెగకు చెందిన వారేలేరు. శర్మ కవీశ్వరుడు; మూర్తి శిల్పి; శాస్త్రి గాయకుడు; రావు కథకుడు; పతి విమర్శకుడు; అందరిలో నేనే వృత్తి కబుర్లపోగును. నాకు సంగీతం అంటే చెవిపోటు! కవిత్వం అంటే తలనొప్పి; శిల్పమంటే కళ్లకలక! యిక యిష్టమైనవి నలుగురుతో కలసి లేతలేత సొరకాయలు తేలికగా తెగకోయడమే. నేను లేనిది సభ రక్తి కట్టనేకట్టదు. శర్మ యెక్కడో మేష్టరు పని చేస్తున్నాడు. మూర్తి యింకా కళార్థిగానే వుండిపోయాడు. శాస్త్రి నాటకాలలో లీనమైనాడు. ఇకరావూ పతీ పత్రికల్లోపడి కొట్టుకొంటున్నారు. మిగిలిన వాణ్ణి నేను. ఉగాది పండుగ అవడంచేత అందరం కలుసుకున్నాం. అందరం కలిసామూ అంటే సుందరకాండ పారాయణమే.

శర్మ ఏవోపిచ్చి గీతాలు గొణుగుతున్నాడు. వసంతం వచ్చిందనే సరికి మా వాడికి మతిపోయింది. యింకానయం; మా వాడింకా ఎవర్నీ ప్రేమించి ఉండకపోబట్టి సరిపోయింది కాని; లేకపోతే వసంతంవచ్చినందు కెంత గడబిడి కావలిసి వుండేదో! శాస్త్ర ప్రకారం ముందుకోకిలను తిట్టాలి; తరువాత ఆ మలయమారుతంమీద యింత దుమ్మెత్తిపొయ్యాలి; అటుపిమ్మట చంద్రుణ్ణీ వసంతుణ్ణీ మన్మథుణ్ణీ వొకడి నేమిటి అడ్డమైనవాళ్ల నూనోరు క్రొవ్వినట్లు తిట్టిపొయ్యాలి. వాడికేం? మధ్యన మా కర్మంకాలేది! వాడికి తామర తూళ్లూ తుషార బిందువులూ కర్పూరపు ముద్దలూ తెచ్చి శైత్యోపచారాలు చెయ్యలేక! ఏదో అంటారే "బడాయికి బావగారు చస్తే యాడవలేక యింటిల్లపాదీ..." అన్నట్లు

కాని దేవుడు మేలుచేస్తే అటువంటి ఓఘాయిత్యం యేమీ తటస్థించలేదు.

మా శాస్త్రిగాడిని పాడమన్నామా, యింక దుంప తెంపాడే! వదను కద్దను అనాటకాల సాంగులన్నీ వినీదాక వదలడం మరిలేదు. రూపాయి పావలా కూలి తీసుకున్న వాడుకూడా అంత శ్రమపడడంటే నిజమైనమాట. పండుగ పూట వాడి ఘోష మనకెందుకని వెంకటేశ్వర్లు ముద్దుపులాగా వాణ్ణి కదల్వకుండా అట్లా అట్టి పెట్టాం. మూర్తి తాను వ్రాసిన బొమ్మలన్నీ గోడల నిండా అలంకారంగా వ్రేలాడదీశాడు. రావు కసిదీరా పొగడుతున్నాడు. నాసంగతి మొదటే చెప్పానుగా నేను ఏం కలగ చేసుకోకుండా చూస్తున్నాను. చూడకపోతే మూర్తి చిన్నపోతాడేమో అనేసుమండి! మా గౌరీపతి ఆ బొమ్మలుచూస్తూ అదనీయిదనీ విమర్శిస్తున్నాడు. వాడివి అసలే సున్నపు కళ్లు: అందరకూ నచ్చినదాన్ని వాడు నచ్చలేదని విమర్శిస్తాడు. అంతెందుకు సంతకం సరిగా వంకర టింకరలేకుండా చేసి మిడకలేడు, ఆ బొమ్మల్ని ఆక్షేపిస్తున్నాడు.

మూర్తి అనుగ్రహమా అని ఆ ఉదయసేవంతా మాకు కర్చులేకుండా సాగిపోయింది. కడుపులో కాఫీ పడగానే వొక్కొక్క మనిషీ యిబ్బడయాడు. ఎవరికి తోచిందో కాని ఆరోజున అంతా కలసి ఫుటో తీయించుకుందామన్న సంకల్పం: మెరపులాగా మెరసింది. శర్మ కండువా సరిచేసుకున్నాడు. శాస్త్రి ముఖం తుడుచుకున్నాడు. రావు క్రాపు దిద్దుకున్నాడు. తలో పనిలో మునిగిపోయారు. మూర్తి దగ్గర కెమేరా వుందన్నాడు పతి. యికనేం మూర్తి వంకకు త్రిప్పారు అన్నికళ్లూ నల్లకలువల తోరణాలు కడుతూ వుత్తుత్తివి. మూర్తి 'సరే'నన్నాడు. అందరూ వొక్కసారిగా సరే అన్నారు.

మూర్తిగారి డాబామీదకు చేరుకున్నది మా పటాలమంతా. క్రిందనుండి ఎవరి కుర్చీ వాళ్లే మోసుకొనివచ్చారు. మూర్తి ఫుటో తీసేవాడు. యికమేం పంచపాండవులం మిగిలాము. ఎవరెట్లా కూర్చుండి ఫుటో తీయించుకోవాలన్న సమస్య వచ్చింది మా యెసంబ్లీలో. పుస్తకం చదువుతూ కూర్చుంటానంటాడు శర్మ. "ఇక నీ గీచినగీటు దాటనని" పద్యం ఆలాపిస్తూవున్న సత్యభామలాగా నిల్చుండి దిగుతా నంటాడు శాస్త్రి. అతని పుణ్యమా అంటూ వేషంకూడా వేసుకుంటాననలేదు. కోకకు నగలకు ఎరువు వెళ్లవలసివచ్చేది. రావు మట్టుకు రావు ఏదో వ్రాస్తూవున్నట్టు పడుకుని గడ్డంక్రింద చెయ్యి పెట్టుకుని-అచ్చంగా రవివర్మ వ్రాసిన శకుంతల పత్ర రచన మోస్తరు—దిగుతా నంటాడు. వీళ్లందరినీ విని పతికూడా ఏదో మహా ఆలోచిస్తూవున్న యోధుడిలా ఆకాశం వంకచూస్తూ వెనక్కు చేతులు విరచికట్టుకొని దిగాలంటాడు. నాకు సుష్టుగా కూర్చుండి కండవా అంచు స్పష్టంగా కనపడేటట్టు దిగాలనివుంది. ఎవడి యిష్టం వాడిదేకాని యింతమందిలో వొకడు చెప్పితే వినే రెండోవాడు లేడు: అందరూ చక్రవర్తులే. సామంతులు జాగీర్దారులు మన్నెదొరలు ఎవరూ లేరు.

మూర్తి కెమేరా స్టాండూ అన్నీ తీసుకొని సిద్ధమయ్యాడు. అందరూ కలసి రాజీపద్ధతిమీద

మూర్తి ఎవర్నేలా చెబితే అలా వుండడానికి సఖ్యత కుదిరింది. అతనికి కావలసిన హంగామా అంతా అతను నెరవేర్చుకున్నాడు. ముగ్గురు కూర్చుంటానికి యిద్దరు వెనక నిల్చుండడానికి ఏర్పాటు జరిగింది. శర్మ పొడుగైనవాడు. నేనూ శాస్త్రీ కొంచెం—కొంచెమని మా మోటమి యెందుకు పదిమందీ అనుకునే పాటి స్థూలకాయులం. అంత మరీ కుర్రవాళ్లు వెంటబడి చప్పట్లు చరిచే టంతమాత్రం కాదు. యిక మా రావూ పతీ పొట్టి పిచ్చుకలు. మధ్య శర్మ కూర్చుంటానికి అటూ యిటూ నేనూ శాస్త్రీ కూర్చుండడానికి వెనుక మా భుజాల మీద చేతులువేసి రావూ పతీ నిల్చుండడానికి నిశ్చయించుకున్నాము. యింతలోకే ఫోటో సంగతి ఎట్లా తెలిసిందో మూర్తి తమ్ముడు అయిదేళ్లవాడు నేనుకూడా దిగుతానంటూ డాబామీదకు పరుగుత్తుకొని వచ్చాడు. వాణ్ణి వద్దంటే యిక యిల్లెగిరి పోయ్యేట్టు యేడుపుకు దిదుతాడన్న సంగతి మాకందరకూ తెలిసిందే. అంతా ఫలానచోట ఫలానచోట అనుకున్నాక వాణ్ణి సర్దడం ఎట్లాగా అని మళ్లా సందేహానికి మొదలు.

శర్మ వొళ్లో కూర్చోపెట్టుకోమంటే నేను దిగడమైనా మానివేస్తాను కాని నా వొళ్లో కూర్చోపెట్టుకో నన్నాడు నిక్కచ్చినా, పోనీ నావొళ్లో కూర్చోపెట్టుకుంటానన్నాడు మా శాస్త్రి. వొళ్లోకూడా యింకో పిల్లవాడు లేందే నా వొక్కడి వొళ్లో కూర్చోపెట్టుకోవడం అంత ఆర్టిష్టిక్‌గా వుండదంటాడు మా మూర్తే. పోనీ శర్మ కాళ్లదగ్గర కూర్చోపెడదాం అనుకున్నాం. సరే బాగానే వుంటుంది యిప్పుడు కళకేమీ చెరుపు లేదనుకుంటే ఆకుర్రగుంటడు నేను కుర్చీమీద కాని క్రింద కూర్చోనంటాడు. అరే! చాలా చిక్కులో పడిపోయామే అనుకున్నాం. వాణ్ణి సమాధానం చేసుకుంటేనే కాని మాపని కాస్తా గట్టెక్కదని తెలుసునుకాని వాడుమాత్రం మాకంటే తక్కువ రకమా మామాట విని వూరుకుంటానికి.

విధిలేక మూర్తి పక్కింటి వాళ్ళ నాలుగేళ్ళ పిల్లవాణ్ణి తీసుకొని వచ్చాడు. వొక కుర్రాడు శాస్త్రి వొళ్లో; వొకడు, నావొళ్లో. యీసారి బాగానేవుంది. అందరినీ సరిగా చూడమన్నాడు మూర్తి. "శర్మ కొంచెం ముఖం ఎత్తాలి. అరే శాస్త్రీ! నీకండువా కొంచెం సరిచేస్తుమా రమణ కొంచెం మెడ ఎడానికి తిప్పాలి. మీరు కొంచెం దగ్గరకురండోయి వెనకవాళ్లు" అంటూ మూర్తి సరిచేస్తున్నాడు. అందరి మొఖాలు చిరునవ్వును తెచ్చుకుంటానికి శత విధాలా ప్రయత్నం చేస్తూవున్నాయి. వొక్క నిముషం అంటే వొక్క నిముషం జరిగితే సలక్షణంగానే వుండేది. యింతలో శాస్త్రి వొళ్లో కూర్చున్న కుర్రాడు వొంటేలుకు కాబోలు చెంగున దిగాడు. యింతా సరిచేసుకున్న సభంతా సముద్రంలాగా వొక్కసారి కలక బారింది. ఏమంటాం ఆ చిన్నపిల్లడిని? ఇంకా మా శాస్త్రి అదృష్టమా అని ఆపని కాస్తా వాడి వొళ్లో కానియ్యలేదు. దానికి చాలా కృతజ్ఞత చూపాలి మావాడు న్యాయమైతే.

యీ గడబిడిలో యింకో చిన్న నాటకం జరిగింది. ఆ రెండో కుర్రవాడు యింటివద్ద

నుండి తెచ్చుకున్న పా కుండలో ఆకు వడలో తింటూవుంటే మూర్తి తమ్ముడు పెట్టమని అడిగాడు. వాడికిష్టం లేక వాడు పెట్టలేదు. మా మూర్తి తమ్ముడు వాడి చేతిలో సున్నంపెట్టి వాడి చేతిలోది కాస్తా వూడ బెరుక్కున్నాడు. దాంతో వాడికీ వీడికీ గ్రుద్దులాట. ఆ పోలికలనులో యిద్దరూ వచ్చి కెమేరామీద పడ్డారు. శర్మ సమయానికి లేచి అది పట్టుకొనక పోతే అది కాస్తా నామరూపాలు లేకుండా నశించి పోయేది. మూర్తికి యాభై అరవై రూపాయలు చేతికి అంటుకునేయి.

సముద్రంలో రేగిన యీ తుపానుతో చల్లబడేటప్పటికి పక్కా పావుగంట గడచింది. యీసారి అందరం పూర్వోక్త విధంగా మూర్తి ఆజ్ఞానుసారం కూర్చున్నాం. కంకువాలు సరుగుకోవడం మాని దానివంకే అందర్నీ చూడమన్నాడు. అందరం లేని నవ్వు తెచ్చుకుంటూ చూస్తున్నాం.

వన్; టూ; త్రీ అన్నాడు మూర్తి. "యిక లేవవచ్చు" అని హెచ్చరిక చెప్పారు. నాది బాగుంటుందంటే నాది బాగుంటుందని డబ్బాలు కొడుతూ వున్నారు. ఆ ప్లేటును అప్పుడే డెవలప్ చేయవలసిందిగా సభవారు మూర్తిని పురమాయించారు. మేం చావిడిలో కూర్చున్నాం. మూర్తి డార్కు రూములోకి వెళ్ళాడు. ఏవో ద్రావకాలు అవీ కలిపి డిష్షులో పోస్తూవున్నాడు. పెళ్లాం ప్రసవవేదన పడుతూవుంటే గది దగ్గర కాచుకున్న మొగాడిలాగా ఎప్పుడా ఎప్పుడా అని కనిపెట్టుకున్నాం. యింతలో మూర్తి తెల్ల మతాబా వెలిగించుకుంటూన్న మొగంతో వచ్చాడు "ఏరా" అన్నాం అంతా. "నిన్న స్లైడ్‌లో ప్లేటు వేసేవుంచానురా. గదిలోకి వెళ్ళిచూస్తే అందులో ప్లేటేలేదు. ఏమైందో" అన్నాడు చాలా చిన్నమొగం చేసుకొని. యింతలో మాదగ్గర వున్న వాడి తమ్ముడు "అదా! అన్నయ్యా! తెస్తానుండు" అంటూ లోపలికి పరుగెత్తుకొని వెళ్ళి తీసుకొని వచ్చాడు. మా దొరలంతా చెమట కార్చేశారు. ఏముంది సంవత్సరాది పూటా యింత గడిబిడి. "అయినా మనకు ఫోటో ఎందుకోయ్!" అన్నారంతా. ఔను నిజంగా ఫోటో మనకెందుకు అన్నా నేనుకూడా.

## ఏజెంట్లకో మాట

మీ మీ ప్రాంతాల్లో "వినోదిని"కి ఎవరైనా చందాదారులుగా చేరదలచుకొంటే వాళ్లతో మా కార్యాలయానికే స్వయముగా సం॥ చందా సొమ్మును మనియార్డరు ద్వారా పంపేట్టు చెప్పాలి. ఏజెంట్లుమాత్రం చందాదారుల్ని చేర్పింపరాదు. సం॥ చందా స్వల్పం కాబట్టి చందాదారులను చేర్చుటలో కమీషను ఇవ్వడం దుర్లభం.